E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 06-02-2026 (వారం) శుక్రవారం  సంపుటి: 02 || సంచిక: 36||  పేజీలు–6  www.ekaburu.com

ముంబయి టీచర్‌కు
రూ. 9 కోట్ల ప్రైజ్‌మనీ » 2లో



## కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు

### ..రాజ్యసభలో ప్రధాని మోదీ



ఈ కబురు, నెట్‌వర్క్ ; కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోందన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు. **--భారత్ పరపతి పెరుగుతోంది..**''దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు. ఈయూ కూటమితో అనేక ఒప్పందాలు చేసుకున్నాం. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అమెరికాతో ట్రేడ్ డీల్ తర్వాత భారత్‌కు మరింత బలం పెరుగుతుంది. మన యువతకు ఎక్కువ లబ్ధి జరగనుంది. **--ప్రపంచ దేశాలు స్వాగతం పలుకుతున్నాయి..**తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి. **--ఎన్నో సంస్కరణలు తెచ్చాం..**బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు..... (మిగతా2లో)

## భారాస.. భాజపాలది ఫెవికాల్ బంధం

--–మాపై విషం చిమ్మడమే వారి పని
–ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్
–కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ఈ కబురు, కరీంనగర్, :**

'భారాస, భాజపాలది ఫెవికాల్ బంధం.. వారెన్ని విమర్శలు చేసినా రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే మా ధ్యేయం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్ వద్ద గురువారం నిర్వహించిన 'ప్రజాపాలనప్రగతి బాట' బహిరంగ సభకు ఆయన హాజరయ్యారు. అంతకుముందు కరీంనగర్, చొప్పదండి మున్సిపాలిటీల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులతో సమావేశమై.. ఎన్నికల వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు రూ.45 కోట్లతో ఏటీసీ భవన నిర్మాణం తదితర అభివృద్ధి పనుల శిలాఫలకాలను వేదిక పక్కన ఏర్పాటు చేయగా సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఆస్తులు సంపాదించారు.. ఫాంహౌస్‌లు కట్టుకున్నారు.. కానీ పేదలకు ఇస్తామన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదు. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20 లక్షల కోట్లు వచ్చినా ఇళ్లు నిర్మించలేకపోయారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో 25 లక్షల మందికి ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లే ఇప్పటికీ కనిపిస్తున్నాయి. పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఇప్పుడు మళ్లీ ఇళ్లిస్తున్నాం. రైతుల కరెంటు కష్టాలు చూడలేక...... (మిగతా2లో)

## రూ.49 కోట్ల లాటరీ.. కన్నడ యువకుడికి జాక్‌పాట్



ఈ కబురు; ఓ ప్రవాస భారతీయుడికి లాటరీ రూపంలో అదృష్టం వరించింది. తన స్నేహితుడితో కలిసి అబుధాబీ బిగ్ టికెట్‌లో దాదాపు రూ.49 కోట్లు గెలుచుకున్నాడు. కర్ణాటకలోని ఉడుపికి చెందిన శంతను శెట్టిగర్ (33).. మస్కట్‌లో రిటైల్ రంగంలో పనిచేస్తున్నాడు. తన స్నేహితుడితో కలిసి బిగ్ టికెట్ లాటరీ కొనుగోలు చేశాడు. ఇటీవల డ్రా తీయగా.. అతడి టికెట్ నంబర్ వచ్చింది. ఊహించని జాక్‌పాట్‌పై అతడు ఆనందం వ్యక్తం చేశాడు. మరోవైపు.. ఈ విషయం తెలియగానే ఉడుపిలోని శంతను ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది.

## 'హిల్ట్'.. రూ.6.3 లక్షల కోట్ల కుంభకోణం

–అవినీతికి నైనీ అతిపెద్ద నిదర్శనం
–భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
–'సేవ్ తెలంగాణ' పేరుతో పవర్ పాయింట్ ప్రజంటేషన్
–రాహుల్, కేసీఆర్ మధ్య ఢిల్లీ స్థాయిలో అవగాహన: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి





**ఈ కబురు, హైదరాబాద్:**

రాష్ట్రంలో హిల్ట్ విధానం, పరిశ్రమల భూముల మార్పు అతి పెద్ద కుంభకోణమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. మొత్తం 9,292 ఎకరాల పరిశ్రమల భూముల మార్పు రూ.6.3 లక్షల కోట్ల కుంభకోణమన్నారు. నైనీ బొగ్గు గనుల కుంభకోణం ప్రభుత్వ అవినీతికి అతిపెద్ద నిదర్శనమని, ఇది చీకటి ఒప్పందమని అన్నారు. టెండర్లు రద్దు చేశారంటే అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయినట్లు గుర్తించాలన్నారు. పురపాలక ఎన్నికల నేపథ్యంలో గురువారం హైదరాబాద్ ముషీరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 'సేవ్ తెలంగాణ 12 ఏళ్ల భారాస, కాంగ్రెస్ పాలనలో క్షీణించిన పట్టణాభివృద్ధి' అంశంపై ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 'సేవ్ తెలంగాణ.. సపోర్ట్ తెలంగాణ' నినాదంతో 78787 83030 నంబరుకు మిస్డ్ కాల్ ఇచ్చి మద్దతు తెలియజేయాలని కోరారు. ''మూసీ సుందరీకరణ పేరుతో నిధుల దోపిడీకి పాల్పడుతూ పేదలను విస్మరిస్తున్నారు. భారాస, కాంగ్రెస్ పాలనలో పట్టణాభివృద్ధి జరగకపోగా పట్టణ స్థానిక సంస్థలకు అప్పులు మిగిలాయి. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయలేదు. ప్రజలపై కొత్త పన్నుల భారం మోపింది. భారాస ప్రభుత్వం చేసిన ఆర్థిక పొరపాట్లను కాంగ్రెస్ సరిదిద్దకపోగా..... (మిగతా2లో)

## తెలంగాణ ప్రతిష్ఠను దిగజార్చేలా ముఖ్యమంత్రి భాష

–జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి.. స్కాం క్యాలెండర్ అమలు చేస్తున్నారు
–హరీశ్‌రావు ధ్వజం




**ఈ కబురు, హైదరాబాద్- :**

తెలంగాణ ప్రతిష్ఠను దిగజార్చేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని భారాస శాసన సభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రజలకు చేసిందేమీ లేక.. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్‌పై సీఎం విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ ఇస్తానని నిరుద్యోగులను మోసం చేసిన సీఎం.. నెలకు ఒక స్కాంతో 'స్కాం క్యాలెండర్' అమలు చేస్తున్నారని ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో, అంతకుముందు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ పురపాలిక ఎన్నికల ప్రచారంలోనూ హరీశ్‌రావు మాట్లాడారు. 'అమెరికా పర్యటన..... (మిగతా2లో)

## మీరా.. 3 రికార్డులు బద్దలు కొట్టి




ఈ కబురు ; భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను సత్తా చాటింది. బుధవారం జాతీయ వెయిట్‌లిఫ్టింగ్‌లో ఆమె మూడు రికార్డులు బద్దలుకొట్టి పసిడి గెలుచుకుంది. మహిళల 48 కేజీల విభాగంలో స్నాచ్‌లో 89 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 116 కేజీలు ఎత్తిన మీరా.. మొత్తంగా 205 కేజీలు లిఫ్ట్ చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో తన పేరిటే ఉన్న స్నాచ్ (88 కేజీలు), క్లీన్ అండ్ జెర్క్ (115 కేజీలు), టోటల్ (203 కేజీలు) జాతీయ రికార్డులను అధిగమించింది. స్నాచ్‌లో 90 కేజీలు ఎత్తేందుకు మీరా గట్టిగానే ప్రయత్నించినా.. ఆఖర్లో బరువును మోయలేక వదిలేసింది.

## స్పీకర్ తీర్పు దుర్మార్గం

–ఫిరాయింపు ఎమ్మెల్యేలకే కాంగ్రెస్ బీ-ఫారాలు
–శాసనసభాపతిపై కాంగ్రెస్ ఒత్తిడి : బండి సంజయ్



**ఈ కబురు, సిరిసిల్ల- , వేములవాడ:**

పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులకు ఆధారాల్లేవంటూ స్పీకర్ తీర్పు ఇవ్వడం దుర్మార్గమన్నారు. శాసనసభాపతిపై కాంగ్రెస్ ఒత్తిడి తెస్తోందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ''పార్టీ మారిన ఎమ్మెల్యేలు గాంధీభవన్ సమావేశాల్లో పాల్గొంటున్నారు. వాళ్లకే ఆ పార్టీ బీఫారాలు ఇస్తోంది. అయినా పార్టీ మారినట్లు ఆధారాల్లేవని కేసు కొట్టివేయడం దారుణం. ఓట్ల కోసం వచ్చే వారిని ప్రజలు ప్రశ్నించాలి. ఒక పార్టీ నుంచి గెలిచి ఇంకో పార్టీ కండువా కప్పుకొని ఎందుకు పనిచేస్తున్నారో నిలదీయాలి. ఓటమి భయంతో కేసీఆర్ కుమారుడు మొన్న రెండ్రోజులు సిరిసిల్లలోనే మకాం పెట్టారు. డబ్బులున్న అభ్యర్థులను ఎంపిక చేసుకొని ఓటుకు ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధపడ్డారు'' అని సంజయ్ విమర్శించారు...... (మిగతా2లో)

## ఆరోపణలు, అనుమానాల ఆధారంగా పరీక్షల రద్దు తగదు

–పారదర్శకత కోసమే బహుళ మూల్యాంకనం
–రెండు హాల్‌టికెట్ల జారీతో నష్టం లేదు
–మాస్ కాపీయింగ్, ప్రశ్న పత్రాల లీకేజీ వంటివి జరిగిన దాఖలాల్లేవు
–తెలుగు అభ్యర్థులకు అన్యాయం జరిగిందనేందుకూ ఆధారాల్లేవు
–గ్రూప్-1పై సింగిల్ జడ్జి తీర్పు రద్దు
–తుది తీర్పు వెలువరించిన హైకోర్టు ధర్మాసనం



**ఈ కబురు, హైదరాబాద్:**

పబ్లిక్ సర్వీసు కమిషన్ వంటి రాజ్యాంగబద్ధ సంస్థ నిర్వహించిన పరీక్షల పవిత్రతను ఊహాగానాలు, నిరాధారమైన ఆరోపణల ఆధారంగా అనుమానించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. మాస్ కాపీయింగ్, ప్రశ్న పత్రాల లీకేజీ జరిగినట్లుగానీ, ఒకరు, లేదంటే కొందరు అభ్యర్థులకు అనుకూలంగా పరీక్షల్లో సహకరించారనిగానీ స్పష్టమైన ఆధారాల్లేకుండా ఏకపక్షంగా పరీక్ష రద్దు చేయడం సరికాదని తేల్చిచెప్పింది. గ్రూప్1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని పరీక్షలు రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లను విచారించిన సింగిల్ జడ్జి.. గత ఏడాది మార్చి 10న విడుదల చేసిన తుది మార్కుల జాబితా, మార్చి 30న విడుదలైన జనరల్ ర్యాంకింగ్ జాబితాను రద్దు చేయాలని, సంజయ్‌సింగ్ కేసులో సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం.. మోడరేషన్ పద్ధతిలో రీవాల్యుయేషన్ ప్రక్రియను మాన్యువల్‌గా నిర్వహించి ఫలితాలను వెల్లడించడం ద్వారా 563 పోస్టులను భర్తీ చేయాలని, లేదంటే తాజాగా పరీక్షలు నిర్వహించాలంటూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ టీజీపీఎస్సీతోపాటు అర్హత సాధించిన అభ్యర్థులు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం 123 పేజీల తుది తీర్పును వెలువరించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసింది. తీర్పులోని ప్రధాన అంశాలిలా.. **--అనుమానాలేగానీ ఆధారాల్లేవు...**''గ్రూప్1 ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు జారీ చేయడం అనుమానాస్పదంగా ఉందని సింగిల్ జడ్జి పేర్కొన్నారు. అయితే పరీక్షల నోటిఫికేషన్‌లో రెండు హాల్‌టికెట్ల జారీపై ఎలాంటి నిషేధం లేదు. రెండు హాల్‌టికెట్ల జారీ అనేది..... (మిగతా2లో)

# కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు

## ..రాజ్యసభలో ప్రధాని మోదీ



(మొదటిపేజీ తరువాయి...)

అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ధి పొందారు. 2014 తర్వాత ప్లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది.

**--చొరబాటుదారులను రక్షిస్తున్నారు..** అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారు'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రతిష్ఠను దిగజార్చేలా ముఖ్యమంత్రి భాష




(మొదటిపేజీ తరువాయి...)

తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఆవేదన కలుగుతోంది. సీఎం హోదాలో ఆయన మాట్లాడుతున్న భాషను సమాజం అంగీకరించడం లేదు. 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నిజం చేసిన వ్యక్తి కేసీఆర్. అందుకే తెలంగాణ సమాజం ఆయనను జాతిపితగా పిలుచుకుంటుంది. దీన్ని చూసి రేవంత్‌రెడ్డికి ఎందుకంత కడుపునొప్పి? మేము బాధ్యత గల శాసనసభ్యులుగా, పౌరులుగా ఆయనలా మాట్లాడడం లేదు. రేవంత్‌రెడ్డి ఏనాడూ ఉద్యమంలో లేరు. ఇప్పుడు ఉద్యమాన్ని, కేసీఆర్ త్యాగాన్ని, కృషిని తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. మిర్యాలగూడ, చొప్పదండి సభల్లో అన్నీ అబద్ధాలే మాట్లాడారు. తన సీఎం కుర్చీని కాపాడుకోవడం కోసం భాజపాతో చీకటి ఒప్పందం చేసుకున్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ సీటును ఆ పార్టీకి బహుమానంగా ఇచ్చింది రేవంత్‌రెడ్డే. ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని అడిగితే ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. కేసీఆర్ సీఎం కాక మునుపు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి అధ్వానంగా ఉండేది. ఇప్పుడు కార్పొరేట్ స్థాయిలో సేవలు అందుతున్నాయి. గజ్వేల్‌కు రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పైసా పనైనా చేయలేదు. ఈ నెల 11లోపు రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు వేయకపోతే కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలి. రాబోయేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే. మన కౌన్సిలర్లను గెలిపించుకుంటే ఆగిపోయిన పనులన్నీ పూర్తి చేసుకుందాం' అని పేర్కొన్నారు. గజ్వేల్ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, భారాస రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ పాల్గొన్నారు.

# ముంబయి టీచర్‌కు రూ. 9 కోట్ల ప్రైజ్‌మనీ



**ఈ కబురు, నెట్‌వర్క్ ;**

భారత్‌కు చెందిన ఉపాధ్యాయురాలు రూబల్ నాగీ ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ టీచర్ ప్రైజ్' అందుకున్నారు. దుబాయ్‌లో జరిగిన వరల్డ్ గవర్నమెంట్స్ సమిట్‌లో ఆమె దీనిని స్వీకరించారు. ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా వందలాది విద్యా కేంద్రాలు ఏర్పాటుచేయడం, పెయింటింగ్‌ల ద్వారా మురికివాడల్లో చిన్నారులకు విద్య అందించేందుకు కృషి చేసినందుకు నాగీకి ఈ గుర్తింపు లభించింది. దీని ద్వారా రూ.9 కోట్ల ప్రైజ్ మనీని నాగీ అందుకున్నారు. ముంబయికి చెందిన రూబల్ నాగీ.. రూబల్ నాగీ ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 800 విద్యా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పాఠశాలలకు వెళ్లని చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడమే లక్ష్యంగా ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితోపాటు బడికెళ్లే పిల్లలకూ విద్యను అందిస్తున్నారు. సైన్స్, గణితం, చరిత్రతోపాటు ఇతర అంశాలను నేర్పించేందుకు గోడలపై చిత్రాలను గీసే విధానాన్ని పాటిస్తున్నారు. గ్లోబల్ టీచర్ ప్రైజ్ అందుకున్న నాగీ.. ఇది తనతోపాటు భారత్‌కు దక్కిన గౌరవమన్నారు. 24 ఏళ్ల క్రితం 30 మంది చిన్నారులతో కలిసి తన ప్రయత్నాన్ని మొదలుపెట్టానని.. ఇప్పుడు లక్షలాది మంది ఇందులో భాగస్వామ్యమయ్యారని చెప్పారు. దేశంలోని ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించేందుకు చేసిన ప్రతి ప్రయత్నం తనకెంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. ఈ ప్రైజ్ మనీతో ఉచిత ఒకేషనల్ ట్రైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. ఈజిప్టు, ఖతార్, యూఏఈలలో పలు విద్యా సంస్థలను నడిపిస్తోన్న జీఈఎంఎస్ ఎడ్యుకేషన్ .. 'వర్కీ ఫౌండేషన్' పేరుతో స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తోంది. సమాజంలో అణగారిన వర్గాల పిల్లలకు విద్యను అందించేందుకు రూబల్ నాగీ కృషి చేస్తున్నారని, ఇది వారి జీవితాలను మార్చడమే కాకుండా కుటుంబాల్లో మార్పు తెస్తుందని ఈ సందర్భంగా వర్కీ ఫౌండేషన్ పేర్కొంది.

# భారాస.. భాజపాలది ఫెవికాల్ బంధం





(మొదటిపేజీ తరువాయి...)

ఉచిత విద్యుత్తు తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది. అది కాంగ్రెస్ పేటెంట్.

**--భాజపా ఒక్క చోట కూడా గెలవదు.....** భాజపా తరఫున మోదీ, అమిత్‌షా ప్రచారానికి వచ్చినా ఒక్క కార్పొరేషన్, మున్సిపాలిటీలోనూ ఆ పార్టీ గెలవదు. తెలంగాణకు భాజపా ఏమిచ్చిందని జాతీయాధ్యక్షుడిని మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చారు? మోదీ 12 ఏళ్లుగా ప్రధానిగా ఉన్నా.. పాలమూరురంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేదు. మెట్రో రెండో దశకు నిధులివ్వలేదు. మూసీ ప్రక్షాళన మాటెత్తలేదు. ఏ ముఖం పెట్టుకొని మళ్లీ వచ్చారు. భాజపా తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డు. భారాసభాజపాల శరీరాలు వేరైనా తల మాత్రం ఒక్కటే. అవయవ దానం మాదిరిగా భారాస.. సీట్లు, ఓట్లు భాజపాకు దానం చేస్తోంది. వేల కోట్ల దోపిడీ చేసిన భారాసకు భాజపా సహకరిస్తోంది. భారాసకు కాళేశ్వరం ఏటీఎం అని మోదీ, అమిత్‌షాలే అన్నారు. మేం కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చించి సీబీఐ విచారణ జరపాలని కోరితే ఆరు నెలలైనా అతీగతీ లేదు. ఫార్ములాఈ రేసు కేసులో కేటీఆర్‌ను, కాళేశ్వరం విషయంలో హరీశ్‌రావును ఎందుకు జైలులో వేయడం లేదు? మీ మధ్య ఏ బంధమూ లేకుంటే మున్సిపల్ ఎన్నికల్లోగా వాళ్లని అరెస్టు చేయించాలి.

**--మేం చేసినవి చెబితే.. గుండెలు పగిలిపోతాయ్..** భాజపా, భారాసల చీకటి ఒప్పందాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోంది. రెండేళ్లలో మేమేం చేశామని అడుగుతున్నారు. ఏం చేశామో చెబితే వాళ్ల గుండెలు పగిలిపోతాయి. నిరుద్యోగులకు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. రూ.20 వేల కోట్లతో 100 యంగ్ ఇండియా స్కూళ్లను ప్రారంభిస్తున్నాం. విద్యార్థుల భోజన ఛార్జీలను 40 శాతం పెంచాం. కాస్మెటిక్ ఛార్జీలు 200 శాతం పెంచాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం అందించనున్నాం. ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలకు యూనివర్సిటీలిచ్చాం. 25 లక్షల మందికి 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రుణమాఫీ చేశాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్తునిచ్చాం. రెండేళ్లుగా రైతుల నుంచి గింజ కూడా వదలకుండా ధాన్యం కొన్నాం. 48 గంటల్లో ఖాతాల్లో డబ్బులు వేశాం. అదే కేసీఆర్ ఫాంహౌస్‌లో 150 ఎకరాల్లో పండించిన పంటను ప్రైవేటు విత్తన కంపెనీకి క్వింటాలు రూ.4 వేల చొప్పున అమ్ముకున్నారు. సూరత్ నుంచి బతుకమ్మ చీరలు కిలోల లెక్కన తెచ్చి.. కోట్ల రూపాయలు కమీషన్ తీసుకున్నారు.

**--సమ్మక్క జాతరకు ఎందుకు రారు?.....** పేదల పండగ సమ్మక్కసారలమ్మ జాతరకు కేసీఆర్ రాలేదు. కేటీఆర్, హరీశ్‌రావులూ రాలేదు. అమ్మవారి దర్శనం చేసుకోవడం వారు నామోషీగా భావిస్తారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు రూ.45 వేల కోట్లతో అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తాం. కేసీఆర్‌లా జీవోలు ఇచ్చి మాట తప్పం, నిలబెట్టుకుంటాం. రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని కేసీఆర్ దివాలా తీయించి మాకు అప్పగించారు. ఎక్కడా చిల్లిగవ్వ పుట్టనివ్వకుండా చేసి ఆయన మాత్రం ఫాంహౌస్‌లో పడుకున్నారు. ఒక్కో సమస్యను అధిగమిస్తూ ప్రభుత్వాన్ని నడిపిస్తుంటే మెచ్చుకోవాల్సింది పోయి నోటికొచ్చినట్లు తిడుతున్నారు. కనీసం అసెంబ్లీకి రాకుండా నెల నెలా జీతమెలా తీసుకుంటున్నారో అర్థం కావట్లేదు.

**--అన్ని మున్సిపాలిటీల్లో మేమే గెలుస్తాం...** రెండేళ్లలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌లకు రూ.17,442 కోట్లు ఖర్చు పెట్టాం. కరీంనగర్ కార్పొరేషన్‌లో రూ.1,489 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. అన్ని చోట్లా మేమే గెలుస్తాం. వరంగల్‌కరీంనగర్‌లకు అనుబంధంగా ఔటర్ రింగ్ రోడ్డును ఏర్పాటు చేసి ఆ పట్టణాల డంపింగ్ యార్డును మధ్యలో ఉంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తాం. కార్యకర్త నుంచి కేంద్రమంత్రి వరకు ఎదిగిన బండి సంజయ్ కరీంనగర్‌లో మా వాళ్లను బెదిరించడం మాని మోదీ వద్దకు వెళ్లి నిధులు తీసుకురావాలి.

అసలు మీ పార్టీలో ఏం జరుగుతోందో మీకు తెలియదు. మీకు, కిషన్‌రెడ్డికి మోదీ అపాయింట్‌మెంట్ దొరకదు. కేటీఆర్, కేసీఆర్‌లకు వ్యతిరేకంగా కిషన్‌రెడ్డి మాట్లాడరు'' అని సీఎం దుయ్యబట్టారు. సభావేదికపై కరీంనగర్ జిల్లా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.110 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, డాక్టర్ సంజయ్, విజయరమణారావు, మక్కాన్‌సింగ్, సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'హిల్ట్'.. రూ.6.3 లక్షల కోట్ల కుంభకోణం






(మొదటిపేజీ తరువాయి...)

ఏడాదిలో రూ.80 వేల కోట్ల అప్పులు చేసింది'' అని అన్నారు.

**--భారాస నుంచి గెలిచినా.. చివరకు కాంగ్రెస్‌లోకే వెళ్తారు.....**

తెలంగాణలో పట్టణాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భాజపాకే ఓటువేయాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్, భారాసలకు ఓటేస్తే భవిష్యత్తులోనూ దోచుకునేందుకు అవకాశం ఇచ్చినట్లే అన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, భారాస అధ్యక్షుడు కేసీఆర్ మధ్య దిల్లీ స్థాయిలో అవగాహన కుదిరిందని ఆరోపించారు. హైకోర్టు న్యాయమూర్తులు, హీరోయిన్లు సహా పలువురి ఫోన్లు ట్యాప్ చేశారని చెప్పినా చర్యలు లేవని అన్నారు. ఈ కేసులో ప్రభుత్వం సాధించిందల్లా.. ఒక డీఎస్పీని సీఐగా డిమోట్ చేయడమే అని అన్నారు. భారాస పాలనలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 26 నెలల పాలనలో ఏం చేసిందో చెప్పాలన్నారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా, వైస్ ఛైర్మన్‌గా, ఛైర్మన్లుగా భారాస నుంచి గెలిచినా వారంతా చివరకు కాంగ్రెస్‌లోకే వెళ్తారన్నారు. జీహెచ్ఎంసీ మేయర్ కూడా భారాసలో గెలిచి కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జి ఆశిష్ షెలార్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్‌గౌడ్, భాజపా జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**--పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లోని అంశాలు....**

12 ఏళ్లుగా తెలంగాణ పురపాలికలు అవినీతి, కమీషన్లు, బుజ్జగింపు రాజకీయాలకు కేంద్రంగా మారాయి. వ్యయాలకు లెక్కల్లేవు. 123 పట్టణ స్థానిక సంస్థలు రూ.3,600 కోట్ల అప్పుల్లో ఉన్నాయి. జీహెచ్ఎంసీ రూ.5,000 కోట్ల అప్పుల ఊబిలో ఉంది. 1,500 మంది పురపాలక అధికారులు, ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కినా చర్యల్లేవు. ప్రజలు చెల్లించిన రూ.3,600 కోట్ల పన్నులను అభివృద్ధికి వ్యయం చేయకుండా రెండు ప్రభుత్వాలు స్వాహా చేశాయి. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైంది. 2025లో 2,945 అత్యాచారాలు, 441 హత్యలు, 1,122 కిడ్నాప్‌లే దీనికి నిదర్శనం. రాష్ట్రంలో 162 మంది ఆటోడ్రైవర్లు, 42 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలో 50 శాతం డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సనాతన ధర్మాన్ని అగౌరవ పరుస్తున్నారు. నిరుద్యోగం 4.5 శాతం నుంచి 5.1కి పెరిగింది. 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీ నెరవేరడంలేదు. ఆర్ఆర్ ట్యాక్స్, ఆర్‌జీ ట్యాక్స్‌ల పేరుతో 30 శాతం, కాంట్రాక్టర్ల నుంచి 20 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలగొడుతున్నారు. కేంద్రం 11 ఏళ్లలో తెలంగాణలో రూ.12 లక్షల కోట్లను అభివృద్ధికి వ్యయం చేసింది.

# ఆరోపణలు, అనుమానాల ఆధారంగా పరీక్షల రద్దు తగదు


(మొదటిపేజీ తరువాయి...)

ఆరోపణలు, అనుమానాల ఆధారంగా పరీక్షల రద్దు తగదు. పిటిషనర్లను ఏవిధంగా నష్టపరిచిందో చూడాలి. ఆ కారణంగా తుది ఫలితాల్లో ఒకరు లేదా కొందరికి ప్రయోజనం చేకూరినట్లు నిరూపణ అయిందా అన్నదీ విశ్లేషించాలి. ఈ పిటిషన్‌కు సంబంధించి సింగిల్ జడ్జి అలాంటి నిర్ధారణేదీ చేయలేదు. మెయిన్ పరీక్షలకు కొత్తగా హాల్‌టికెట్ జారీచేయడం వల్ల పరీక్షల పవిత్రత దెబ్బతిన్నదని పిటిషనర్లు వాదిస్తున్నప్పటికీ అదెలాగో నిరూపించడంలో విఫలమయ్యారు.

**--పరీక్ష కేంద్రాల ఆరోపణలకు ఆధారాల్లేవు....** పరీక్ష కేంద్రాల పెంపుతోపాటు కేటాయింపులకు సంబంధించి కమిషన్ దురుద్దేశపూరితంగా వ్యవహరించిందన్న ఆరోపణలను పిటిషనర్లు నిరూపించలేకపోయారు. పరీక్ష కేంద్రాల కేటాయింపు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా జరిగిందని, పురుషులకు మరుగుదొడ్లు లేకపోవడం వల్లనే కొన్ని కేంద్రాలను మహిళలకు కేటాయించామని కమిషన్ వెల్లడించింది. 2 సెంటర్లను మహిళా అభ్యర్థులకు మాత్రమే కేటాయించడంతో పక్షపాతం జరిగిందనుకోలేం.

**--ఏకరీతి మూల్యాంకనం....** కమిషన్ మూల్యాంకనంలో ఏకరీతిని అనుసరించిందని, ఆ మూల్యాంకన విధానంలో అభ్యర్థిని గుర్తించడానికి అవకాశం ఉందని పిటిషనర్లు ఆరోపణలు చేస్తున్నారు. బహుళ మూల్యాంకన విధానంలో బార్‌కోడ్ ఉండదని, అభ్యర్థిని గుర్తించలేమని కమిషన్ వివరించింది. పైపెచ్చు కమిషన్ ఏ ఒక్క అభ్యర్థికీ అనుకూలంగా వ్యవహరించినట్లు పిటిషనర్లు నిర్దిష్టమైన ఉదాహరణలు చూపలేకపోయారు. నిష్పక్షపాతంగా పరీక్ష నిర్వహించడంలో కమిషన్ విఫలమైందనీ నిరూపించలేకపోయారు. పరీక్ష రాసిన అభ్యర్థులందరి ప్రొవిజనల్ మార్కుల జాబితాను కమిషన్ వెల్లడించి ఉంటే..ఇతర అభ్యర్థుల మార్కులతో పోల్చుకోవడానికి అవకాశం ఉండేదని సింగిల్ జడ్జి తీర్పులో పేర్కొన్నారు. అయితే.. ప్రతి అభ్యర్థి లాగిన్ ద్వారా తనకు పేపర్ వారీగా వచ్చిన మార్కులు చూసుకునే అవకాశం ఉంది. తన మార్కుల రీకౌంటింగ్ కోసం.. మరొకరికి కేటాయించిన మార్కులను తెలుసుకోవాలన్నది అనుమతించదగ్గ అంశం కాదు.

**--తెలుగు అభ్యర్థులకు అన్యాయం ఊహాజనితమే.....** తెలుగు భాషలో ప్రావీణ్యం ఉన్న మూల్యాంకనదారులు ప్రత్యేకంగా లేకపోవడం వల్ల తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని సింగిల్ జడ్జి చెబుతున్న దానిలో వాస్తవాలు లేవు. డిగ్రీ కళాశాల అధ్యాపకులు తెలుగు, ఇంగ్లిషు భాషల్లో బోధిస్తున్నారు. అందువల్ల రెండు భాషల్లోనూ మూల్యాంకనం చేయడానికి వారు సమర్థులే. సింగిల్ జడ్జి వాస్తవ ఆధారాలకంటే ఊహాజనితమైన అంశాలపైనే ఎక్కువ ఆధారపడినట్లు కనిపిస్తోంది'' అని ధర్మాసనం తీర్పులో వెల్లడించింది. పరీక్షల రద్దు అనేది వ్యవస్థాపరమైన అక్రమాలు జరిగినప్పుడే జరగాలి. అలాంటి ఆధారాలేవీ లేకుండా.. కేవలం పిటిషనర్లు చేసే ఆరోపణల ఆధారంగా అలాంటి నిర్ణయానికి రాలేం. విస్తృత ప్రజాప్రయోజనాల నేపథ్యంలో ఏకరీతి మూల్యాంకనం అనుసరించిన కారణంగా..ఏ ఒక్క అభ్యర్థికీ నష్టం వాటిల్లలేదు. ఎలాంటి ఆధారాల్లేకుండా సంజయ్ సింగ్ కేసులో పేర్కొన్నట్లు మోడరేషన్ పద్ధతిలో రీవాల్యుయేషన్ నిర్వహించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులు నిలబడవు. మూల్యాంకనం నిమిత్తం కమిషన్ 351 మందిని నియమించింది. అభ్యర్థి గుర్తింపును గోప్యంగా ఉంచి, ఒకరికంటే ఎక్కువ మందితో మూల్యాంకనం జరిపించి మార్కులు కేటాయించినపుడు.. ఎలాంటి ఆధారం లేకుండా..కేవలం



ఆరోపణలతో 20 వేల మందికి చెందిన మూల్యాంకన ప్రక్రియను కలుషితం చేయలేం

## స్పీకర్ తీర్పు దుర్మార్గం : బండి సంజయ్

(మొదటిపేజీ తరువాయి...)

''వచ్చేమూడేళ్లు తామే అధికారంలో ఉంటామని చెప్పి.. పోలీసులను అడ్డుపెట్టుకొని నామినేషన్లు వేయకుండా భాజపా కార్యకర్తలను వేములవాడ ఎమ్మెల్యే బెదిరించారు. రాజన్న ఆలయ పునర్‌నిర్మాణం పేరుతో కాంగ్రెస్ నేతలు మోసం చేస్తున్నారు. కాంగ్రెసోళ్ల మాటలు విని పోలీసులు శాంతిభద్రతల సమస్య సృష్టిస్తే ఇబ్బందులు పడతారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పైసలే లేవని ముఖ్యమంత్రే చెప్పారు. అలాంటి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏం లాభం.. భాజపాను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటా'' అని బండి సంజయ్ భరోసా ఇచ్చారు.

# రెండేళ్లయితే కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు: హరీశ్‌రావు



**ఈ కబురు, గజ్వేల్:**

మనల్ని బాగా చూసుకున్న వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు గజ్వేల్‌లో పందులతో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి.. ఇప్పుడు ఎలా ఉందో చూడాలన్నారు. ''రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు. కానీ, బంగారం ధర భారీగా పెరిగింది. అప్పుడు ఆశపెట్టిన సీఎం ఇప్పుడు దానిపై స్పందించట్లేదు. రేవంత్‌రెడ్డికి తిట్లు తప్ప వేరే ఏమీ రావు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి చేయలేదు. రైతుబంధు డబ్బులు ఎన్నికల తర్వాత ఇస్తానని సీఎం అంటున్నారు. 11వ తేదీలోపు రైతుబంధు ఇవ్వకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారు. రేవంత్‌రెడ్డి.. నీకు ధైర్యం ఉంటే కేసీఆర్‌తో అభివృద్ధిలో పోటీ పడు. మా కౌన్సిలర్లను గెలిపిస్తే వచ్చే ప్రభుత్వం మాదే అవుతుంది. రెండేళ్లయితే మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారు. మిగిలిన పనులు పూర్తి చేసుకుందాం. భాజపా వాళ్లు ఏమీ చేయరు''అని హరీశ్‌రావు అన్నారు.

# పుర ఎన్నికల్లో యువరక్తం



**–40 ఏళ్ల లోపు వారు 56 శాతం**

**–40 నుంచి 50 ఏళ్లు 31.8 శాతం**

**–50 ఏళ్లు దాటిన వారు 12.1 శాతం**

**ఈ కబురు, హైదరాబాద్:**

రాష్ట్రంలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాల ఎన్నికల్లో పెద్దఎత్తున యువత పోటీ చేస్తోంది. అభ్యర్థుల ఎంపికలో అన్ని పార్టీలు యువతీయువకులకే పెద్దపీట వేస్తూ టికెట్లు ఇచ్చాయి. పోటీపడుతున్న మొత్తం 12,944 మందిలో 56.1 శాతం మంది 40 ఏళ్ల లోపు వారు ఉన్నారు. వీరిలో 70 శాతం మంది గ్రాడ్యుయేట్లు, అండర్ గ్రాడ్యుయేట్లు. 40 నుంచి 50 ఏళ్ల వయసు వారు 31.8 శాతం కాగా 50 ఏళ్లు దాటిన వారు 12.1 శాతం మంది. స్థానిక ఎన్నికల్లో పోటీకి నిబంధనల మేరకు కనీస వయసు 21 ఏళ్లు ఉండాలి. ఆ వయసు ఉన్న వారు ఎవ్వరూ పోటీ చేయడం లేదు. 22 ప్రారంభ వయసుగా ఉంది. ఈ వయసు గల వారు 62 మంది పోటీలో ఉన్నారు. జమ్మికుంట పురపాలికలోని 28వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న వి.దామోదర్(78)ది అత్యధిక వయసు. మహిళల్లో పెద్ద వయస్కురాలు అదే పురపాలికలోని 30వ వార్డు స్వతంత్ర అభ్యర్థిని సిలువేరు సత్తమ్మ(77). 22 నుంచి 30 ఏళ్ల వయసు ఉన్నవారు 2,330 (18 శాతం) మంది. వీరిలో ఎక్కువ మంది నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఉన్నారు. రాష్ట్రంలో పుర ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో 156 మంది విద్యార్థులున్నారు. మొత్తంలో వారి శాతం 1.2. ఇందులో యువతుల కంటే యువకులు ఎక్కువగా ఉన్నారు. --89 శాతం మంది గృహిణులే.... రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో 50.27 శాతం మహిళలు పోటీలో ఉండగా... వారిలో 89 శాతం మంది గృహిణులు. పోటీపడుతున్న 6,508 మందిలో 5,435 మంది గృహిణులు. మహిళా అభ్యర్థుల్లో 4.67% మంది మాత్రమే వ్యాపారాన్ని తమ వృత్తిగా పేర్కొన్నారు. ఆదిలాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, నిజామాబాద్ వంటి చోట్ల వ్యాపార నేపథ్యం ఉన్న వారు ఎక్కువగా కనిపిస్తున్నారు.

# ఏప్రిల్ లేదా మే నెలలో సర్ షెడ్యూల్!


**–ఇప్పటికే సన్నాహక పనులు మొదలయ్యాయి**

**–సమన్వయం కోసం బీఎల్ఏలను నియమించుకోవాలి**

**–రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో సుదర్శన్‌రెడ్డి**

**ఈ కబురు, హైదరాబాద్:**

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) షెడ్యూల్‌ను ఏప్రిల్‌మే నెలల మధ్య ప్రకటించే అవకాశం ఉందని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వే కోసం రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక్కో బీఎల్ఏ(బూత్ స్థాయి ఏజెంట్)ను నియమించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో సమావేశమయ్యారు. ''ఓటర్ల జాబితా సవరణ సమయంలో కచ్చితత్వం, పారదర్శకత, సమస్యల పరిష్కారానికి బీఎల్ఏల నియామకం తప్పనిసరి. పోలింగ్ కేంద్రం పరిధిలోని స్థానికులనే బీఎల్ఏలుగా నియమించుకోవాలి. వీర




సమన్వయంతో పనిచేయాలి. సర్వే తాలూకూ సన్నాహక పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. 2025 ఓటర్ల జాబితాను...2002 ఓటర్ల జాబితాతో సరిపోల్చే మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. పట్టణాల్లో నివాసాలను గుర్తించేందుకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేస్తున్నారు. సర్వే నోటిఫికేషన్ వెలువడిన తర్వాత సమయం పరిమితంగా ఉంటుంది కనుక పార్టీలు ఇప్పట్నుంచే సన్నద్ధమవ్వాలి. సర్వే జరిగేదిలా...: సర్వే సన్నాహక దశలో పోలింగ్ కేంద్రం పరిధి ప్రాంతంలోని నివాస గృహాలను బీఎల్‌వోలు మూడు, నాలుగుసార్లు సందర్శిస్తారు. మొదటి సందర్శనలో జనగణన చేస్తారు. తదుపరి మొదటిసారి అందుబాటులో లేని కుటుంబాల వద్దకు వెళ్తారు. ఈ సన్నాహక దశల్లో మ్యాపింగ్ జరగని ఓటర్లు సర్ సర్వే సమయంలో తమ వివరాలను సమర్పించుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్ర కీలకం. అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తప్పిపోకుండా ఉండడమే ప్రధాన ఉద్దేశం'' అని సీఈవో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్లు, డిప్యూటీ సీఈవో హరిసింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోదీ, అమిత్‌షా.. ధైర్యముంటే తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేయండి

**–ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్**

**–ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటామని హామీ**

**ఈ కబురు, హైదరాబాద్ :**

''కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తుంటే.. అందుకు విరుద్ధంగా.. భాజపా అధికారంలోకి వస్తే మైనార్టీలకు కల్పించిన 4% రిజర్వేషన్లను తొలగిస్తామంటూ ఆ పార్టీ అధ్యక్షుడు నితిన్ నబీన్ అంటున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గతంలో చేవెళ్ల సభలోనూ ఇదే మాట చెప్పారు. మేం అండగా ఉన్నంతవరకు ముస్లిం మైనార్టీలకు ఏం కాదు.. మోదీ, అమిత్‌షాలకు ధైర్యముంటే తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేయండి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో గురువారం జమాతే ఉలేమా హింద్ సంస్థ నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాము చేపట్టిన కులగణన సర్వే దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ ప్రభావంతోనే కేంద్రం జనగణనలో 'కుల గణన' అంశం చేర్చిందన్నారు. దేశ స్వాంతంత్ర్యం కోసం పోరాడిన జమాతే ఉలేమా హింద్ సంస్థ.. స్వాతంత్ర్యానంతరం దేశవ్యాప్తంగా గల్లీగల్లీలో పేదప్రజలను ఆదుకునేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ''ముస్లిం మైనార్టీలకు కల్పించిన రిజర్వేషన్లను సోదరులందరూ వినియోగించుకోండి. మీ పిల్లలను డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లుగా మారేందుకు ప్రోత్సహించండి. నాయకులుగా ఎదిగేలా వారికి పాఠాలు చెప్పండి. షబ్బీర్ అలీ, అజారుద్దీన్‌లా రాజ్యాధికారం పంచుకోవాలని వివరించండి. రాష్ట్రంలో మతంపైనా, వ్యక్తులపైనా విద్వేషం చిమ్మిన వారిని జైల్లో వేస్తాం. హేట్ స్పీచ్‌పై చట్టాన్ని రూపొందించేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సహకారం తీసుకుంటున్నాం'' అని సీఎం చెప్పారు. సమావేశంలో జమాతే ఉలేమా సంస్థ ప్రతినిధులు సయ్యద్ ఇక్బాలుద్దీన్ హష్మీ, పీర్‌ఖలీల్ అహ్మద్ సాబేర్, సాహెద్, మహ్మద్ ఇలియాస్, మెరాజుద్దీన్, అబ్దుల్ సత్తార్, టిమ్రిస్ వైస్‌ఛైర్మన్ ఫహీమ్ ఖురేషి, జిల్లాల నుంచి వచ్చిన ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



# సైబర్ భద్రత.. పాలనలో అంతర్భాగం కావాలి

**ఈ కబురు, హైదరాబాద్:**

ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికత అనేది నేరస్థులకు ఆయుధంగా మారిందని... అదే సాంకేతికతను మనం రక్షణ కవచం(షీల్డ్)గా మలచుకోవాలని సీఎస్ రామకృష్ణారావు సూచించారు. పరిపాలనలో సైబర్ భద్రత అంతర్భాగం కావాలని సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో గురువారం జరిగిన సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ 'షీల్డ్ 2026' రెండో ఎడిషన్‌ను సీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాలను ఎదుర్కోవడంలో దర్యాప్తు సంస్థలకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న నేరవిధానాల కారణంగా ఈ తరహా కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతోందన్నారు. టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ ప్రసంగిస్తూ.. విద్యాసంస్థలు, పరిశ్రమలు, పరిశోధన సంస్థలతో కలిసి సైబర్ సెక్యూరిటీ ఎకో సిస్టమ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమన్నారు. రాజస్థాన్ డీజీ సంజయ్‌కుమార్ అగర్వాల్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్త్, ఈగిల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, పంజాబ్, మధ్యప్రదేశ్ అదనపు డీజీపీలు నీరజ, సాయిమనోహర్, ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసుదేవన్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు తదితరులు పాల్గొన్నారు.

**--3 డిజిటల్ కార్యక్రమాల ప్రారంభం.....** టీజీసీఎస్‌బీ అభివృద్ధి చేసిన డిజిటల్ కార్యక్రమాలను సదస్సులో ప్రారంభించారు. ఏఐ ఆధారిత బహుభాషా సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్, సహాయక వ్యవస్థ 1930 (సారథి).. వేగవంతమైన, ఏకీకృత సైబర్ నేరాల దర్యాప్తు కోసం రూపొందించిన ప్లాట్‌ఫాం సెంటినల్.. పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించి డిజిటల్ సాక్ష్యాలను ఆటోమేటెడ్ విధానంలో ప్రాసెస్ చేసేందుకు రూపొందించిన ఏఐ ఆధారిత వ్యవస్థ (సిసైట్)ను సీఎస్ ఆవిష్కరించారు. ఈ సదస్సు కోసం టీజీసీఎస్‌బీ కొద్దిరోజుల క్రితం దరఖాస్తులను ఆహ్వానించింది. దేశవ్యాప్తంగా 500కి పైగా బృందాలు దరఖాస్తులు చేసుకున్నాయి. విజేతగా నిలిచిన 'క్యాపాస్ నెక్స్‌ట్‌జెన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థకు రూ.5లక్షలు అందించారు.

**--ప్రధాన ఆకర్షణగా టెజ్....** అధునాతన, ప్రయోగాత్మక సైబర్ సెక్యూరిటీ, ప్రజాభద్రత సాంకేతికతలను ప్రదర్శించిన టెక్నాలజీ ఎక్స్‌పీరియన్స్ జోన్ (టెజ్) సదస్సులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రోబోటిక్ డాగ్, హ్యూమనాయిడ్ రోబో, ఫ్లైట్ సిమ్యులేటర్, డ్రోన్ టెక్నాలజీ, కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత భద్రత పరిష్కారాలను టెజ్‌లో ప్రదర్శించారు. రోబో



డాగ్ విన్యాసాలు.. రోబో కరచాలనం లాంటి సన్నివేశాలు ఆకట్టుకున్నాయి.

# రాష్ట్రపతిని అవమానించారు

**–ఎన్నికల్లో వరుస ఓటములతో ప్రతిపక్షాల్లో అసహనం**

**–చొరబాటుదారులను మమత కాపాడుతున్నారు**

**–తీవ్రంగా ధ్వజమెత్తిన ప్రధాని మోదీ**

**–రాష్ట్రపతికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగం**

**–లోక్‌సభలో ప్రధాని సమాధానం లేకుండానే తీర్మానం ఆమోదం**

**ఈ కబురు, ఢిల్లీ:**



'కాంగ్రెస్ నన్నేమీ చేయలేదు. ఎన్నికల్లో వరుస ఓటములను జీర్ణించుకోలేక ఆ పార్టీ నాపై విద్వేష ప్రచారం చేస్తోంది' అని రాజ్యసభ వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ధ్వజమెత్తారు. లోక్‌సభలో అంతరాయం కలిగించడం ద్వారా పేద, గిరిజన రాష్ట్రపతినే కాకుండా రాజ్యాంగ అత్యున్నత పదవిని ఆ పార్టీ అవమానించిందని విమర్శించారు. కేంద్ర మంత్రి బిట్టూను ద్రోహిగా పేర్కొనడం ద్వారా సిక్కులను రాహుల్ గాంధీ అవమానించారని వ్యాఖ్యానించారు. మన ప్రజల ఉద్యోగాలకు, గిరిజనుల భూములను లాక్కునే చొరబాటుదారులకు మమత రక్షణ కల్పిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం రాజ్యసభలో ప్రధాని సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ విపక్షాలు సభలో నినాదాలు చేశాయి. ఆ తర్వాత వాకౌట్ చేశాయి. మరోవైపు లోక్‌సభలో ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం పొందింది. బుధవారం ప్రతిపక్షాలకు చెందిన మహిళా ఎంపీలు ప్రధానిని చుట్టుముట్టిన నేపథ్యంలో ఆయనను తానే రావొద్దన్నానని స్పీకర్ ఓం బిర్లా గురువారం వెల్లడించారు. రాజ్యసభలో దాదాపు 100 నిమిషాలు ప్రసంగించిన ప్రధాని మోదీ పలు అంశాలను ప్రస్తావించారు.

**--ప్రేమ దుకాణం అంటూ సమాధి వ్యాఖ్యలా..**

'ప్రేమ దుకాణం గురించి మాట్లాడేవారు మోదీకి సమాధి తవ్వుతామని అంటున్నారు. ఎందుకంటే మా ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసింది. ఈశాన్యంలో తీవ్రవాదాన్ని, దేశంలో నక్సలిజాన్ని అంతం చేసింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. ఇలా ఎన్నో విజయాలను సాధించిన నా చావును కాంగ్రెస్ కోరుకుంటోంది. ఎన్నికల్లో ఓటములతో వచ్చిన అసహనమే ఇది. వారు ఎప్పటికీ నా సమాధిని తవ్వలేరు. నాలాంటి పేద వ్యక్తి అత్యున్నత స్థానానికి చేరుకుని, కొనసాగడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. దేశంలోని కోట్ల మంది తల్లులు, సోదరీమణులు, పేదల ఆశీస్సులు ఉన్నంత కాలం వారు నన్నేమీ చేయలేరు' అని ప్రధాని పేర్కొన్నారు. 'తృణమూల్ పార్టీ సహచరులు చాలా మాట్లాడారు. వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. జాలి లేని తృణమూల్ ప్రభుత్వం దిగజారుడులో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. వారు ఇక్కడ ప్రసంగాలు చేస్తారు. కానీ అక్కడి ప్రభుత్వం.. ప్రజలను చీకట్లోకి నెడుతోంది. సంపన్న దేశాలూ అక్రమ వలసదారులను వెనక్కి పంపుతున్నాయి. కానీ ఇక్కడ వారి కోసం కోర్టులపైనా ఒత్తిడి తెస్తున్నారు' అని మోదీ ధ్వజమెత్తారు. 'బుధవారం లోక్‌సభలో జరిగిన ఘటనలు రాష్ట్రపతికి జరిగిన అవమానంగా భావిస్తున్నాం' అని మోదీ పేర్కొన్నారు. రాజకీయ కక్షల కారణంగా కాళ్లు కోల్పోయిన సదానందన్ మాస్టర్ ఎన్నడూ తప్పుడు భాష వాడలేదని, ఆయననూ విపక్షాలు అవమానించాయని ప్రధాని తెలిపారు.

**--9 వాణిజ్య ఒప్పందాలు**

11 ఏళ్లలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రధాని వివరించారు. అధిక వృద్ధి, అత్యల్ప ద్రవ్యోల్బణం దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని నిరూపించాయని పేర్కొన్నారు. 'ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోంది. దక్షిణార్ధ గోళ దేశాల గొంతుకగా మన దేశం మారింది. ఇటీవలి రోజుల్లో పలు దేశాలతో 9 వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకున్నాం. ఐరోపా కూటమి, అమెరికాతో వాణిజ్య ఒప్పందాలతో మరింత సుస్థిరంగా మారామని ప్రపంచం భావిస్తోంది. అమెరికా ఒప్పందాన్ని ప్రపంచం మొత్తం ప్రశంసిస్తోంది' అని ప్రధాని పేర్కొన్నారు.

**--నినాదాల మధ్యే..**

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు రాజ్యసభలో ఆందోళన దిగాయి. వారి నినాదాల మధ్యే ప్రధాని ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే.. నిల్చుని నినాదాలు చేస్తుండటంతో.. కూర్చుని చేయవచ్చని ప్రధాని చురక అంటించారు. ఆ తర్వాత ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. అంతకుముందు రాజ్యసభలో గందరగోళం నెలకొంది. లోక్‌సభలో రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడాన్ని ఖర్గే ప్రస్తావించారు. అయితే లోక్‌సభ అంశాలను రాజ్యసభలో చర్చించడం తగదని రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా సూచించారు.

**--లోక్‌సభలో.. గురువారం లోక్‌సభ ప్రారంభం నుంచే గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రధాని మోదీ ఫొటోతో ఉన్న పోస్టర్లను ప్రదర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణె రాసిన పుస్తకం గురించి ప్రస్తావించారు.**

**--ప్రతిపక్షాల తీరు చూసి ప్రధానిని నేనే వద్దన్నా: ఓం బిర్లా**

లోక్‌సభలో ప్రధాని కూర్చున్న చోటకు వచ్చి కాంగ్రెస్ ఎంపీలు అనూహ్య చర్యకు పాల్పడతారనే కచ్చితమైన సమాచారం ఉందని, అందుకే గురువారం ఆయనను సభకు రావొద్దని తానే సూచించానని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. ఒకవేళ అలాంటి ఘటన జరిగితే దేశ ప్రజాస్వామ్య సంప్రదాయానికి తీవ్ర విఘాతం కలిగేదని స్పష్టం చేశారు. ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 3 గంటల సమయంలో స్పీకర్ వివరణ ఇచ్చారు. 'బుధవారం సభలో కొందరు సభ్యుల ప్రవర్తన సరిగా లేదు. ఇలాంటి పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదు. ఇది ఎంతో బాధాకరం. మాయని మచ్చ' అని ఓం బిర్లా వ్యాఖ్యానించారు. తన సూచనను గౌరవించి ప్రధాని సభకు రాకుండా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్పీకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ స్పందించారు. స్పీకర్ వెనుక ప్రధాని దాక్కుంటున్నారని విమర్శించారు. సభలో మోదీని ఇబ్బంది పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయని స్పీకర్ పేర్కొనడం అబద్ధమని స్పష్టం చేశారు.

## లోహరంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి.. నష్టాల్లో ముగిసిన సూచీలు



దేశీయ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి (Stock Market). అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూల సంకేతాలు, లోహరంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 500 పాయింట్లు నష్టపోయి, 83,313 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 132 పాయింట్లు కుంగి, 25,642 వద్ద ముగిసింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 83,757 వద్ద (క్రితం ముగింపు 83,817 ) ప్రారంభమైంది. ఒక దశలో 83,784 వద్ద గరిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.33గా ఉంది.

నిఫ్టీ సూచీలో ట్రెంట్, మ్యాక్స్ హెల్త్‌కేర్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఓఎన్‌జీసీ షేర్లు రాణించాయి. హిందాల్కో, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ స్టాక్స్ నష్టాలను చవిచూశాయి.

కారణాలివే..


నేటి ట్రేడింగ్‌లో నష్టాలకు ప్రధాన కారణం లోహరంగ షేర్లు. అవి రెండు శాతం మేర కుంగాయి. డాలర్ బలపడటంతో కమోడిటీ ధరలు పెరగడం, గత మూడు సెషన్లలో దూసుకెళ్లిన మెటల్ ఇండెక్స్‌లో కరెక్షన్ చోటుచేసుకోవడం నష్టాలకు కారణం. మరోవైపు, ఆసియా మార్కెట్లలోని దక్షిణకొరియా కొస్పి మూడుశాతం పతనమైంది. జపాన్ నిక్కీ, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. బుధవారం సాయంత్రం అమెరికా మార్కెట్లు నష్టాల్లోనే ముగిశాయి.

## ఏఐతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు గల్లంతు: రమేశ్ దమానీ

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కారణంగా ఎంట్రీలెవల్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని మార్కెట్ నిపుణుడు, ప్రముఖ మదుపరి రమేశ్ దమానీ అన్నారు. ఐఐటీలు, ఇతర టెక్ ఇన్‌స్టిట్యూట్లలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో వచ్చే 'ఈజీ జాబ్స్' పోతాయని పేర్కొన్నారు. గతంలో సులభంగా దొరికిన జాబ్స్ భవిష్యత్తులో లభించకపోవచ్చన్నారు. ఆంథ్రోపిక్ సహా పలు ఏఐ సంస్థల రాకతో ఐటీ రంగంలో అలజడి నెలకొన్న నేపథ్యంలో ఆయన 'ఎన్డీటీవీ ప్రాఫిట్'తో మాట్లాడారు.**

ఏజెంటిక్ AI వంటి వాటితో ఈ మార్పు త్వరగా జరుగుతుందని రమేశ్ దమానీ అన్నారు. అలాగని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొత్త ఉద్యోగావకాశాలకు ఢోకా ఉండబోదన్నారు. కొత్తగా ఉద్యోగ సృష్టి జరుగుతుందని, భవిష్యత్‌లో మాత్రం ఐటీ రంగానికి వచ్చే ఇబ్బందేమీ ఉండబోదని పేర్కొన్నారు. యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్ అనే జాబ్ ఒకటి ఉంటుందని 80ల్లో ఎవరూ ఊహించి ఉండరని పేర్కొన్నారు. అదే మాదిరిగా ఏఐ కూడా కొత్త అవకాశాలను సృష్టిస్తుందని చెప్పుకొచ్చారు.

భారత్‌లోని టాప్7 సాఫ్ట్‌వేర్ కంపెనీల మొత్తం విలువ 350 బిలియన్ డాలర్లు కాగా.. ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్ ఒక్క దాని విలువే 350 బిలియన్ డాలర్లు అని దమానీ పేర్కొన్నారు. ఆయా ఐటీ కంపెనీల్లో మొత్తం 16 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా.. ఆంథ్రోపిక్‌లో కేవలం 2 వేల మంది మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. ఏఐ కారణంగా పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకునేందుకు గతేడాది ఉద్యోగులను తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. గతేడాది అమెరికాలో సుమారు 55 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు.



## బెంగళూరులో గూగుల్ భారీ క్యాంపస్!




అంతర్జాతీయ టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్, మనదేశంలో మరింత విస్తరణకు సన్నాహాలు చేస్తుంది. విదేశీ ఉద్యోగులకు వర్క్ వీసా నిబంధనలను అమెరికా ప్రభుత్వం కఠినతరం చేసిన నేపథ్యంలో, కావాల్సిన నిపుణులను చేర్చుకునేందుకు భారత్‌లోనే మరో పెద్ద కార్యాలయ సముదాయాన్ని ఏర్పాటు చేసుకునే దిశగా అడుగులు వేస్తోందని బ్లూమ్‌బర్గ్ న్యూస్ వెల్లడించింది. మన దేశంలో టెక్ హబ్‌గా ఉన్న బెంగళూరులో, కొత్తగా భారీ కార్యాలయం నిర్మించేందుకు స్థలాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. బెంగళూరు వైట్‌ఫీల్డ్ టెక్ కారిడార్‌లోని అలెంబిక్ సిటీలో ఒక ఆఫీస్ టవర్‌ను ఆల్ఫాబెట్ లీజుకు తీసుకుందని సమాచారం. మరో రెండు స్థలాలను కొనుగోలు చేసిందని, వీటి మొత్తం విస్తీర్ణం 24 లక్షల చదరపు అడుగులని చెబుతున్నారు. ఈ మొత్తం స్థలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మొత్తంగా 20,000 మంది అదనపు సిబ్బంది పనిచేసేందుకు వీలవుతుంది. ప్రస్తుతం మన దేశంలో ఆల్ఫాబెట్‌కు 14,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా కంపెనీలో 1,90,000 మంది పనిచేస్తున్నారు.

## ఉద్యోగులకు కాగ్నిజెంట్ గుడ్‌న్యూస్.. 100శాతం బోనస్




ప్రముఖ ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ తమ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2025 సంవత్సరానికి గానూ 100శాతం బోనస్ (Cognizant 100% Bonus) ప్రకటించింది. రెండేళ్లకు ముందే కంపెనీ తన లక్ష్యాలను చేరినందుకు గానూ ఈ బోనస్ చెల్లింపులు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ మేరకు కాగ్నిజెంట్ (Cognizant) సీఈఓ ఎస్.రవికుమార్ ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్ సందేశంలో పేర్కొన్నారు. "ఉద్యోగుల క్రమశిక్షణ, పనితీరు, కాగ్నిజెంట్‌పై మన క్లయింట్ల నిబద్ధతకు 2025లో కంపెనీ సాధించిన ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఉద్యోగుల కృషికి గుర్తింపుగా.. 100శాతం బోనస్ ప్రోగ్రామ్‌ను అమలుచేస్తాం" అని రవికుమార్ తన సందేశంలో తెలిపారు. ఆదాయ వృద్ధి, లాభాలు వంటి అంశాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన అగ్ర శ్రేణి సంస్థల జాబితాలో కాగ్నిజెంట్ చేరింది. 'విన్నర్స్ సర్కిల్'గా అభివర్ణించే ఈ జాబితాలో 2027 నాటికి చేరాలని కాగ్నిజెంట్ లక్ష్యంగా పెట్టుకోగా.. 2025లోనే కంపెనీ దాన్ని సాధించగలిగింది. 2025 మొత్తానికి కాగ్నిజెంట్ ఆదాయం 7% పెరిగి 21.10 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.90 లక్షల కోట్ల)కు చేరింది. జనవరి-డిసెంబరును ఆర్థిక సంవత్సరంగా ఈ కంపెనీ పరిగణిస్తుంటుంది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 3.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మెజార్టీ ఉద్యోగులు భారత్‌లోనే పని చేస్తున్నారు.

## ఒక్క రోజే రూ.30వేలు తగ్గిన వెండి ధర.. కాస్త దిగొచ్చిన పసిడి

దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు గురువారం దిగొచ్చాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.6,600 తగ్గి రూ.1,59,680 పలికింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,550గా ఉంది. ఇక, వెండి ధర భారీగా పడిపోయింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.30వేల మేర తగ్గింది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,69,000గా ఉంది. (Gold, Silver rates in Hyderabad)

అంతర్జాతీయంగానూ ఈ లోహాల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఔన్సు పుత్తడి (Gold) ధర 4,919 డాలర్లు, ఔన్సు వెండి (Silver) ధర 79 డాలర్లుగా కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు వెండి దాదాపు 7శాతం కుంగి కిలో ధర రూ.2.49 లక్షల వద్ద ఉంది. ఏప్రిల్ డెలివరీలకు పసిడి ధర స్వల్పంగా పెరిగి 10 గ్రాముల ధర రూ.1.53 లక్షలకు చేరింది.




## ఎల్ఐసీ లాభం రూ.12,958 కోట్లు

దిల్లీ: ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (LIC) త్రైమాసిక ఫలితాలను గురువారం ప్రకటించింది. 2025 డిసెంబర్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.12,958 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదుచేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.11,057 కోట్ల నికర లాభంతో పోలిస్తే 17 శాతం వృద్ధి నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో ప్రీమియంల ద్వారా వచ్చే ఆదాయం రూ.1,25,613 కోట్లుగా ఉంది. గతేడాది త్రైమాసికంలో ఈ మొత్తం రూ.1,06,891 కోట్లుగా ఉందని ఎల్ఐసీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ.2,01,994 కోట్ల నుంచి రూ.2,33,984 కోట్లకు పెరిగింది. ఒక్క మూడో త్రైమాసికంలో కమీషన్ కింద ఏజెంట్లకు రూ.6011 కోట్లు చెల్లించింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.5,966 కోట్లుగా ఉంది. అక్టోబర్ డిసెంబర్ త్రైమాసికంలో తొలి ప్రీమియం వసూళ్ల కింద రూ.10,605 కోట్లు వచ్చినట్లు కంపెనీ తెలిపింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.7,285 కోట్లుగా ఉంది. త్రైమాసిక ఫలితాల వేళ కంపెనీ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎన్ఎస్‌లో షేరు విలువ 0.56 శాతం లాభంతో రూ.840 వద్ద స్థిరపడింది.




## తెలుగు రాష్ట్రాల్లో నేడు పెట్రోల్, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయంటే..?

పెట్రోల్, డీజిల్ ధరలు గత కొంతకాలంగా స్థిరంగా కొనసాగుతున్నాయి. అయితే గత సంవత్సరం దేశవ్యాప్తంగా లీటర్ పెట్రోల్, డీజిల్ ఎక్సైజ్ డ్యూటీని రూ.2 పెంచుతూ కేంద్ర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో వాహనదారులు ఆందోళనకు గురి అయ్యారు. కానీ, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. పెరిగిన ధరల ప్రభావం ప్రజలపై ఉండదని స్పష్టం చేసింది. ఎక్సైజ్ సుంకాన్ని ఆయిల్ కంపెనీలే భరిస్తాయని పేర్కొంది. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ప్రతి నెల ఒకటో తారీకున అయిన వీటి ధరల్లో మార్పులు జరుగుతాయి. ఇందులో భాగంగా ఈ నెలలో అయినా ధరల్లో మార్పు జరిగి ప్రజలకు ఊరట లభిస్తుందేమో అని ఎదురు చూడగా.. ఈ నెలలో కూడా ధరల్లో ఎలాంటి మార్పులు జరగకపోవడంతో వారికి నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో ఈరోజు పెట్రోల్, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

హైదరాబాదు
లీటర్ పెట్రోల్ ధర: రూ. 107. 46
లీటర్ డీజిల్ ధర రూ: రూ. 95. 70

విశాఖపట్నం
లీటర్ పెట్రోల్ ధర: రూ. 108. 38
లీటర్ డీజిల్ ధర రూ: రూ. 96. 26

విజయవాడ
లీటర్ పెట్రోల్ ధర: రూ. 109.02
లీటర్ డీజిల్ ధర రూ: రూ. 96. 85



## వాయిదా పడిన ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే?



: ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'స్కై' చిత్రం వాయిదా పడినట్లు మూవీ టీమ్ అఫీషియల్‌గా ప్రకటించారు. ఫిబ్రవరి 6న ఈ మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రావాల్సి ఉండగా.. కొన్ని అనివార్య కారణాల చేత వాయిదా పడినట్లు తెలిపాడు. అలాగే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ.. ఓ పోస్టర్ విడుదల చేశారు. ఫిబ్రవరి 13న 'స్కై' చిత్రం రిలీజ్ చేస్తుండగా.. విడుదల చేసిన పోస్టర్‌లో హీరో, హీరోయిన్ రొమాంటిక్ స్టిల్ ఆడియన్స్‌ను ఆకట్టుకుంటోంది. మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్నారు. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. ప్రమోషనల్ కంటెంట్‌తో పాటు లిరికల్ సాంగ్స్‌తో మంచి ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా 'స్కై' మూవీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.




## పెద్ద స్టార్ అయి ఉండి నన్ను ప్రోత్సహించడం నాకెంతో గర్వంగా ఉంది: రాషా తడాని

బాలీవుడ్ స్టార్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని(Rasha Tadani) కేవలం నటనకే పరిమితం కాకుండా, సింగింగ్‌లోనూ తన సత్తా చాటుతోంది. అభయ్ వర్మతో కలిసి నటిస్తున్న 'లైకీ లైకా' (Laikey Laikaa) చిత్రంలో ఆమె స్వయంగా ఒక పాట పాడి యూట్యూబ్‌ను షేక్ చేసింది. ఈ పాట విడుదలైన తర్వాత నెటిజన్ల నుంచి మంచి రెస్పాన్స్ రావడమే కాకుండా, టాలీవుడ్ సూపర్ స్టార్ ప్రభాస్ నుంచి ప్రశంసలు దక్కడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాషా తడాని ఆసక్తికర కామెంట్స్ చేసింది. ''నాకు సంగీతం, నృత్యం, నటన అంటే చాలా ఇష్టం. ఐదేళ్ల వయసులో నేను గులాం ముస్తఫా ఖాన్ కుమారుడైన ఖాదిర్ ముస్తఫా ఖాన్ వద్ద హిందుస్తానీ శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ప్రారంభించాను. నేను జాజ్ సంగీతం కూడా నేర్చుకున్నాను.

సంగీతం ఒక విముక్తి లాంటిది, మీరు మీ సాధన చేసే ఆ ఒక్క గంట మీకు మీకంటూ లభించే సమయం. నేను స్నానం చేసేటప్పుడు పాటలు పాడటంలో పూర్తిగా మునిగిపోతాను. ఇప్పుడు సంగీత పరిశ్రమలో అడుగు పెట్టే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉంది. ఈ సంగీతం నాకు ఒక ప్రశాంతతను ఇస్తుంది. నేను ఒక 'షవర్ సింగర్'ని, ఇప్పుడు మ్యూజిక్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం నా కల నిజమైనట్లుగా ఉంది'' అని రాషా తెలిపింది. పాటలో వినిపించే డమరుకం శబ్దాల గురించి రాషా స్పందిస్తూ.. ''నేను 12 జ్యోతిర్లింగాల యాత్రను పూర్తి చేశాను. శివుడు మతపరంగానే కాకుండా నా జీవితంలో ఒక భాగంగా మారిపోయాడు. ఈ పాటలో డమరుకం మోగుతుంటే నాకు నటరాజ స్వామి నాట్యమే గుర్తొస్తుంది. అందుకే నాలోని ఈ కళను ఆ పరమశివుడికే అంకితం చేస్తున్నాను'' అని తన భక్తిని చాటుకుంది. రాషా పాట విన్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సోషల్ మీడియా వేదికగా ఆమెను అభినందించడంపై రాషా స్పందిస్తూ.. ''ప్రభాస్ గారు నాకు పెద్ద ఇన్స్పిరేషన్. ఆయన అంత పెద్ద స్టార్ అయి ఉండి, నన్ను ప్రోత్సహించడం చాలా గర్వంగా ఉంది. ఆయన ఇచ్చిన బూస్టింగ్ నా ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది'' అంటూ రాషా ఎమోషనల్ అయింది.



## ఆ పాత్ర వల్ల నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది.. కన్నీరు పెట్టుకున్న భూమిక



భూమిక చాలా కాలం తర్వాత 'యుఫోరియా'(Euphoria) అనే సోషల్ థ్రిల్లర్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి గుణశేఖర్ దర్శకత్వం వహించగా.. ఇందులో గౌతమ్ మీనన్, సారా అర్జున్, పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాను నీలిమ గుణ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకుని ఫిబ్రవరి 6న విడుదలకు సిద్ధమైంది. ఈక్రమంలో.. తాజాగా, మూవీ మేకర్స్ 'యుఫోరియా' ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఇక ఇందులో పాల్గొన్న భూమిక ఎమోషనల్ స్పీచ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా భూమిక మాట్లాడుతూ.. 'యుఫోరియా'లో తన పాత్ర చాలా బరువైనదని తెలిపింది. షూటింగ్ సమయంలో అనేక రాత్రులు నిద్ర పట్టలేదని, పాత్రలోని భావోద్వేగాలు తనను వెంటాడాయని చెప్పింది. "అర్ధరాత్రి 1 గంట, 2 గంటల సమయంలో నిద్రలేచి ఆ పాత్ర గురించే ఆలోచించేదాన్ని.

ఆ ఎమోషన్స్ నుంచి బయటకు రావడం నాకు చాలా కష్టంగా అనిపించింది" అని ఆమె వెల్లడించింది. షూటింగ్ సమయంలో సెట్స్‌లో కూడా అనేకసార్లు భావోద్వేగాన్ని నియంత్రించుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నానని భూమిక తెలిపింది. కొన్ని సన్నివేశాలు తనను లోపల నుంచి కుదిపేశాయని, ఆ పాత్ర కోసం మానసికంగా పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చిందని పేర్కొంది. మాట్లాడుతున్న సమయంలో భూమిక ఒక్కసారిగా భావోద్వేగానికి లోనై స్టేజ్‌పైనే కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె పరిస్థితిని గమనించిన చిత్ర యూనిట్ సభ్యులు, అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. 'యుఫోరియా' నేటి సమాజంలో జరుగుతున్న వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన సినిమా అని, అందులోని సామాజిక అంశాలే తనను ఎక్కువగా ప్రభావితం చేశాయని భూమిక పేర్కొన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.



## మరో ఘటన జరగకముందే జాగ్రత్త పడండి: సోనూసూద్

**ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై నటుడు సోనూసూద్ (Sonu Sood) ఆందోళన వ్యక్తంచేశారు. 16 ఏళ్లలోపు పిల్లలకు ఆన్‌లైన్ గేమింగ్‌పై ఆంక్షలు విధించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.**

**"16 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌లకు సాధ్యమైనంతవరకూ దూరంగా ఉంచాలి. గాజియాబాద్‌లో ముగ్గురు పిల్లలు ఈ వ్యసనం కారణంగా ప్రాణాలు కోల్పోయారు. హింస, పేదరికం వల్ల వాళ్లు చనిపోలేదు.. ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ వ్యసనం కారణంగా కనిపించని ఒత్తిడి వల్ల వాళ్లు మరణించారు. నేను గతంలో కూడా దీనిపై పోరాటం చేశాను. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాను.. దయచేసి పిల్లలను సోషల్‌మీడియాకు దూరంగా ఉంచండి. మరోసారి ఇలాంటి ఘటన జరగకముందే జాగ్రత్తలు తీసుకోండి" అని సోనూసూద్ అన్నారు.**

### పారిశుధ్య కార్మికురాలి నిజాయితీకి పట్టం..

## మానవత్వం చాటిన తమిళ నటులు, సీఎం కుడు

ఈ రోజుల్లో బంగారం ధర ఆకాశాన్ని తాకుతుంటే.. మనుషుల నిజాయితీ మాత్రం పాతాళానికి పడిపోతోందన్న మాటలు తరచూ వినిపిస్తుంటాయి. కానీ, చెన్నైకి చెందిన ఓ పారిశుధ్య కార్మికురాలు మాత్రం ఆ మాటలను నిజం కాదని తేల్చి చెప్పారు. చెత్తలో దొరికిన భారీ మొత్తంలో బంగారాన్ని ఏమాత్రం ఆశపడకుండా తిరిగి ఇచ్చేసి, మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించింది. ఆమె నిజాయితీకి మెచ్చిన తమిళ చిత్ర పరిశ్రమ ఇప్పుడు ఆమెకు నీరాజనాలు పలుకుతోంది.

**అసలేం జరిగిందంటే..?**

చెన్నైలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మ.. ఎప్పటిలాగే తన విధుల్లో భాగంగా చెత్త సేకరణ చేస్తుండగా ఆమెకు ఒక బ్యాగ్ దొరికింది. అందులో సుమారు 30 తులాల (రూ.45 లక్షల విలువ గల) బంగారు ఆభరణాలు ఉన్నాయి. కష్టాల్లో ఉన్నా సరే, ఆ బంగారాన్ని చూసి ఆమె మనసు మారలేదు. వెంటనే ఆ బ్యాగును పోలీసులకు అప్పగించి, అది అసలు యజమానులకు చేరేలా చేసింది.

**'ప్రపంచ సుందరి' అంటూ పాదపూజ**

కార్మికురాలు పద్మ నిజాయితీ గురించి తెలుసుకున్న విలక్షణ నటుడు, దర్శకుడు పార్తీబన్ ఆమెను ఘనంగా సత్కరించారు. చెన్నైలోని ఎతిరాజ్ కాలేజీకి అతిథిగా వెళ్లిన ఆయన.. తనతో పాటు పద్మను కూడా తీసుకెళ్లారు. 'నన్ను గెస్ట్‌గా పిలిచారు.. కానీ ఈ కార్యక్రమానికి అసలైన 'చీఫ్ గెస్ట్' ఆమే' అంటూ ఆమెను వేదికపైకి ఆహ్వానించారు. అందరి సమక్షంలో ఆమెకు పాదపూజ చేసి, కొత్త చీరను బహూకరించారు. అంతేకాకుండా, ఆమె తలపైన 'ప్రపంచ సుందరి' (Miss World) కిరీటాన్ని పెట్టి గౌరవించారు. ఈ సందర్భంగా పార్తీబన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "బంగారం ధర పెరుగుతున్న కొద్దీ, మానవత్వం విలువ తగ్గిపోతోంది. కానీ, పద్మ తన నిజాయితీతో ఆ మాటకు అర్థం మార్చారు. చెత్తలో దొరికిన 360 గ్రాముల బంగారాన్ని తిరిగిచ్చి, ఆమె ప్రపంచంలోనే అత్యున్నత మనిషిగా అవతరించారు. అందుకే ఆమెకు కిరీటం పెట్టి నేను గర్వపడుతున్నాను" అని రాసుకొచ్చారు.

**సూపర్ స్టార్ రజినీ, సీఎం స్టాలిన్ రివార్డు..**

పద్మ నిజాయితీకి ముగ్ధుడైన సూపర్ స్టార్ రజినీకాంత్ ఇటీవల ఆమెను తన నివాసానికి ప్రత్యేకంగా ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఆమె చేసిన పనిని అభినందిస్తూ శాలువాతో సత్కరించి, ఓ బంగారు గొలుసును కానుకగా ఇచ్చారు. కాగా, అంతకుముందే పద్మ నిజాయితీని గుర్తిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆమెను పిలిపించి అభినందించడంతో పాటు, రూ. 1 లక్ష రివార్డును అందజేశారు. ఒక సామాన్య పారిశుధ్య కార్మికురాలు చూపిన నిజాయితీ, ఇప్పుడు ఆమెను సెలబ్రిటీల మన్ననలు పొందేలా చేసింది.




## ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనురాగ్ కశ్యప్ పేరు? స్పందించిన దర్శకుడు

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్ (Epstein Files)లో అనురాగ్ కశ్యప్ (Anurag Kashyap) పేరు ఉందంటూ ప్రచారం జరుగుతోంది. ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఓ ఈవెంట్ కోసం అనురాగ్ 2017లో బీజింగ్ వెళ్లారంటూ రూమర్స్ వచ్చాయి. వీటిపై దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ స్పందించారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. వాటిని ఖండించారు. ''వక్తగా నాకు నెలకు దాదాపు 15 ఆహ్వానాలు వస్తుంటాయి. అరుదుగా వాటిపై స్పందిస్తుంటా. నా జీవితంలో ఇప్పటి వరకూ బీజింగ్ వెళ్లలేదు'' అని పేర్కొన్నారు. తన సినిమాల కన్నా తన పేరుతో కూడిన ప్రచారంపై ఆసక్తి చూపించడాన్ని తప్పుబట్టారు. బాలీవుడ్‌కు చెందిన ఇతర దర్శక నిర్మాతలు, నటీనటుల పేర్లు కూడా ఉన్నట్లు వార్తలు రావడం చర్చనీయాంశమవుతోంది.



# అదిగో కప్పు.. ఇవిగో అడ్డంకులు



**టీ20 ప్రపంచకప్ రేపటి నుంచే**

చాలా ఏళ్ల నుంచి ఏ ఐసీసీ టోర్నీ మొదలవుతున్నా టీమ్‌ఇండియాపై భారీ అంచనాలే ఉంటున్నాయి. దశాబ్ద కాలం పాటు ఆ అంచనాలను అందుకోవడంలో భారత జట్టు విఫలమైంది. కానీ గత రెండేళ్లలో టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీలు నెగ్గి సత్తా చాటింది టీమ్‌ఇండియా. ఇప్పుడు సొంతగడ్డపై జరగబోతున్న పొట్టి ప్రపంచకప్‌లో సూర్యకుమార్ సేన టైటిల్ ఫేవరెట్లలో ఒకటనడంలో సందేహం లేదు. కానీ కప్పుభారత్ మధ్య కొన్ని బలమైన అడ్డంకులే ఉన్నాయి.

ప్రపంచకప్ ముంగిట పాకిస్థాన్‌తో తన చివరి టీ20 సిరీస్ ఆడింది ఆస్ట్రేలియా. అందులో ఆ జట్టు 03తో వైట్‌వాష్‌కు గురైంది. ఆ ఫలితాన్ని బట్టి ఆస్ట్రేలియాను అంచనా వేస్తే పొరపాటే. పాకిస్థాన్‌కు వెళ్లడానికి ఇష్టం లేక ప్రధాన ఆటగాళ్లు కొందరు ఆ సిరీస్‌కు దూరంగా ఉన్నారు. దీంతో సిరీస్ ఓడిపోయింది ఆసీస్. కానీ ప్రపంచకప్‌లో ఆ జట్టు ఆట పూర్తి భిన్నంగా ఉంటే ఆశ్చర్యమేమీ లేదు. ఆ జట్టు టైటిల్ ఫేవరెట్లలో ఒకటనడంలో సందేహం లేదు. ప్రపంచంలోనే అత్యంత విధ్వంసక బ్యాటర్లలో ఒకడైన ట్రావిస్ హెడ్, కెప్టెన్ మిచెల్ మార్ష్‌లతో కూడిన ఓపెనింగ్ ద్వయం ఆ జట్టుకు అతి పెద్ద బలం. ఇంకా జోష్ ఇంగ్లిస్, టిమ్ డేవిడ్ లాంటి దూకుడైన బ్యాటర్లు.. మ్యాక్స్‌వెల్, స్టాయినిస్, కూపర్ కనోలీ, కామెరూన్ గ్రీన్ లాంటి మేటి ఆల్‌రౌండర్లు ఆ జట్టు సొంతం. బౌలింగ్‌లో కమిన్స్ దూరం కావడం పెద్ద ఎదురు దెబ్బే.ఆస్ట్రేలియా ఒకే ఒక్కసారి 2021లో టీ20 ప్రపంచకప్ గెలిచింది.

అనుపానులు తెలుసుకుని..: 2021లో ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన కివీస్.. గత టోర్నీలో సెమీస్ చేరకుండానే నిష్క్రమించింది. ఈసారి ఆ జట్టు ఆల్‌రౌండ్ నైపుణ్యంతో కప్పుపై కన్నేసింది. టోర్నీ ముంగిట భారత్‌లో అయిదు మ్యాచ్‌ల టీ20ల సిరీస్ ఆడడం ఆ జట్టుకు కలిసొచ్చే విషయం. ఈ సిరీస్‌లో 14తో ఓడినా సరే.. భారత్‌కు గట్టి పోటీనే ఇచ్చింది. ఇక్కడి పిచ్‌లు, పరిస్థితులపై అవగాహన పెంచుకోవడం, భారత ఆటగాళ్ల మీదా ఒక అంచనాకు రావడం ఆ జట్టుకు ఎంతో ఉపకరించేదే. భారత్‌తో చివరి టీ20లో చెలరేగి ఆడిన ఫిన్ అలెన్‌కు తోడు కాన్వే, సీఫర్ట్, మిచెల్, ఫిలిప్స్, రచిన్ రవీంద్రలతో ఆ జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. కెప్టెన్ శాంట్నర్‌తో పాటు బ్రాస్‌వెల్, ఇష్ సోధిల స్పిన్ ఆ జట్టుకు ఎంతో కీలకం.

అన్ని విధాలా..: ప్రపంచకప్ దగ్గర పడుతుండగా భారత్‌లో పర్యటించే అవకాశం దక్కించుకున్న మరో జట్టు దక్షిణాఫ్రికా. డిసెంబరులో జరిగిన ఆ సిరీస్‌లో 13తో ఓడినప్పటికీ ఆతిథ్య జట్టుకు దీటుగానే నిలిచింది సఫారీ జట్టు. ఓపెనింగ్ చేసే కెప్టెన్ మార్‌క్రమ్, స్పిన్నర్‌గానూ జట్టుకు ఉపయోగపడతాడు. అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. తన ఓపెనింగ్ భాగస్వామి డికాక్ ఎంతటి ప్రమాదకర బ్యాటరో తెలిసిందే. ఇక ప్రస్తుతం ప్రపంచ మేటి టీ20 బ్యాటర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న బ్రెవిస్‌తో పాటు రికిల్‌టన్, స్టబ్స్‌లతో సఫారీ జట్టుకు మెరుగైన బ్యాటింగ్ విభాగం ఉంది. ఆల్‌రౌండర్లు మార్కో యాన్సెన్, కార్బిన్ బోష్ బ్యాటుతో, బంతితో సత్తా చాటగలరు. భారత్‌తో సిరీస్‌లో ఆడలేకపోయిన రబాడ ప్రపంచకప్ కోసం సిద్ధంగా ఉన్నాడు. అతడితో పాటు ఎంగిడి, మఫాకాలతో పేస్ విభాగమూ బాగుంది. కానీ స్పిన్‌కు అనుకూలించే అవకాశమున్న పిచ్‌లను ఆ జట్టు ఎంతమేర సద్వినియోగం చేసుకోగలదన్నదే ప్రశ్న.

# భారత శిక్షణ వ్యవస్థకు గోపీచంద్ దిశానిర్దేశం



దిల్లీ: భారత క్రీడారంగంలో శిక్షణ ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి పెంచేందుకు పుల్లెల గోపీచంద్ నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ అందించిన విప్లవాత్మక సిఫార్సులను దశలవారీగా అమలు చేయనున్నట్లు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. "టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల అమలు దశలవారీగా జరుగుతుంది. ఎన్‌సీఏబీ ఏర్పాటు, ఏకీకృత పాఠ్య ప్రణాళికను ఖరారు చేయడం వంటి చర్యల్ని స్వల్పకాలంలో చేపట్టాలని నిర్ణయించాం" అని మాండవీయ పేర్కొన్నారు. శిక్షణలో విప్లవాత్మక మార్పులు అవసరమని గోపీచంద్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల టాస్క్‌ఫోర్స్ 43 పేజీల నివేదికలో పేర్కొంది. కోచ్‌లకు టాప్స్ పథకాన్ని ప్రవేశపెట్టడం.. ఎన్‌సీఏబీ ఏర్పాటు.. నాలుగు స్థాయిల శిక్షణ వ్యవస్థ.. మాజీ క్రీడాకారులకు ప్రాధాన్యత వంటి సంస్కరణల్ని టాస్క్‌ఫోర్స్ సూచించింది.

# ఆర్సీబీ అద్వితీయం



పీఎల్ టైటిల్ గెలవడానికి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పురుషుల జట్టుకు 18 ఏళ్లు పట్టింది. కానీ ఆర్సీబీ మహిళల జట్టు రెండేళ్ల వ్యవధిలో రెండు కప్పులు కొట్టేసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మొదలైనప్పటి నుంచి పట్టువదలకుండా ఫైనల్ చేరుతున్న దిల్లీ క్యాపిటల్స్‌కు మరోసారి నిరాశనే మిగులుస్తూ ట్రోఫీ పట్టుకుపోయింది.



కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వోల్ మామూలుగా విరుచుకుపడలేదు. ఈ జంట ఎడాపెడా బౌండరీల మోతతో విధ్వంసం సృష్టించడంతో కొండంత లక్ష్యాన్ని ఛేదించేసింది ఆర్సీబీ దిల్లీ ఆఖర్లో బంతితో పుంజుకోవడంతో ఆట ఉత్కంఠభరితంగా మారినా చివరికి ఆర్సీబీదే పైచేయి అయింది. బెంగళూరు ఇంతకు ముందు 2024లో విజేతగా నిలిచింది. పాపం దిల్లీ. వరుసగా నాలుగు ఫైనళ్లు ఓడడాన్ని జీర్ణించుకోవడం ఆ జట్టుకు కష్టమే.

భారీ స్కోర్ల మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుదే పైచేయి. స్మృతి మంధాన (87; 41 బంతుల్లో 12×4, 3×6), జార్జియా వోల్ (79; 54 బంతుల్లో 14×4) వీరవిహారం చేయడంతో గురువారం డబ్ల్యూపీఎల్4 ఫైనల్లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. జెమీమా (57; 37 బంతుల్లో 8×4), లారా వోల్వార్ట్ (44; 25 బంతుల్లో 3×4, 2×6) మెరవడంతో మొదట దిల్లీ 4 వికెటకు 203 పరుగులు చేసింది. లిజెలి (37; 30 బంతుల్లో 3×4, 3×6) షినెలి (35 నాటౌట్; 15 బంతుల్లో 4×4, 2×6) కూడా మెరిశారు. స్మృతి, వోల్ జంట రెండో వికెట్‌కు 92 బంతుల్లో 165 పరుగులు జోడించడంతో లక్ష్యాన్ని బెంగళూరు 19.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది .

ఆ ఇద్దరి విధ్వంసం: టీ20ల్లో రెండొందలపై లక్ష్యాన్ని ఛేదించడం ఎప్పుడైనా, ఎక్కడైనా ఎంతో కష్టమే. ఫైనల్ అయితే ఇంకా ఒత్తిడి ఉంటుంది. కానీ కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వోల్‌ల నిర్దాక్షిణ్య విధ్వంసంతో 204 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు ఛేదించేసింది. నిజానికి రెండో ఓవర్లోనే ప్రమాదకర గ్రేస్ హారిస్ (9)ను ఔట్ చేయడం ద్వారా ఆర్సీబీని ఒత్తిడిలోకి నెట్టేట్లే కనిపించింది దిల్లీ. కానీ ఆ జట్టు సంతోషం ఎంతో సేపు నిలవలేదు. మరో ఓపెనర్ స్మృతి, జార్జియా వోల్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. దిల్లీ బౌలింగ్‌ను తుత్తునియులు చేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఏ బౌలర్‌నూ వదల్లేదు. షినెలి, కాప్ ఓవర్లలో వోల్ రెండేసి ఫోర్లు బాదేస్తే.. నందని బౌలింగ్‌లో స్మృతి వరుసగా 4, 6 కొట్టింది. వోల్ 37 బంతుల్లో, స్మృతి 23 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. వీరి జోరుతో 12 ఓవర్లలో 124/1తో నిలిచింది ఆర్సీబీ. ఆ తర్వాత కూడా ఇద్దరి జోరు కొనసాగింది. ముఖ్యంగా స్మృతి ఎడాపెడా ఫోర్లు కొట్టేసింది. 16 ఓవర్లలో 169/1తో విజయం వైపు పరుగులు పెట్టింది ఆర్సీబీ. ఈ జట్టు గెలుపు ఇక తేలికే అనిపించింది. కానీ దిల్లీ పుంజుకోవడంతో ఆఖర్లో డ్రామా తప్పలేదు.

ఆఖర్లో ఇలా..: సాఫీగా లక్ష్యం దిశగా సాగుతున్న ఆర్సీబీ.. ఆఖర్లో ఒత్తిడికి గురైంది. 17వ ఓవర్లో వోల్‌ను ఔట్ చేయడం ద్వారా మ్యాచ్‌ను కాస్త ఆసక్తికరంగా మార్చింది మిన్ను మణి. ఆ తర్వాతి పరిణామాలతో క్లైమాక్స్.. అనూహ్యంగా రసవత్తరంగా మారింది. ఆఖరి మూడు ఓవర్లలో ఆర్సీబీకి 27 పరుగులు అవసరం కాగా.. 18వ ఓవర్లో 9 పరుగులే ఇచ్చిన నందని, రిచా (6)ను ఔట్ చేసింది. తర్వాతి ఓవర్లో షినెలి.. 8 పరుగులే ఇచ్చి ప్రమాదకర స్మృతిని వెనక్కి పంపింది. చివరి ఓవర్లో ఆర్సీబీకి 10 పరుగులు అవసరం కావడంతో ఉత్కంఠ తీవ్రమైంది. శ్రీచరణి బౌలింగ్‌లో తొలి రెండు బంతులకు 2 పరుగులు వచ్చాయి. కానీ ఆ తర్వాత కవర్ మీదుగా వరుసగా రెండు బౌండరీలు బాదిన రాధ యాదవ్ (12 నాటౌట్) ఆర్సీబీని సంబరాల్లో ముంచెత్తింది. 19వ ఓవర్లో, స్మృతి ఔటైన వెంటనే, రాధ ఇచ్చిన ఓ తేలికైన క్యాచ్‌ను మిన్ను మణి జారవిడిచి ఉండకపోతే మ్యాచ్ ఫలితం భిన్నంగా ఉండేదేమో! ఆ తప్పిదానికి రెండు పరుగులు కూడా వచ్చాయి.

జెమీమా ధనాధన్: దిల్లీ అంతకుముందు అదరగొట్టింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ జట్టుకు తొలి మూడు ఓవర్లలో 9 పరుగులే రాగా.. ఆ తర్వాత ఓపెనర్లు లిజెలి లీ, షెఫాలి వర్మ బ్యాట్లు ఝుళిపించారు. ఆరో ఓవర్లో షెఫాలి వెనుదిరిగేటప్పటికి స్కోరు 49. లిజెలి వరుసగా 4, 4, 6.. వోల్వార్ట్ ఓ ఫోర్ బాదడంతో ఏడో ఓవర్లో శ్రేయాంక 19 పరుగులు సమర్పించుకుంది. జోరుమీదున్న లిజెలిని నదైన్ ఔట్ చేసినా.. ఆర్సీబీకి సంతోషించడానికేమీ లేకపోయింది. ఆమె స్థానంలో వచ్చిన జెమీమా చెలరేగిపోయింది. మరోవైపు వోల్వార్ట్

# కుర్రాళ్లూ.. ఇంకొక్క అడుగే!



హరారే: అంచనాలకు తగ్గట్లే రాణిస్తూ, అజేయంగా అండర్19 ప్రపంచప్ ఫైనల్ చేరిన యువ భారత్.. ఇదే ఊపును ఇంకొక్క మ్యాచ్‌లో కొనసాగిస్తే ఛాంపియన్ అవుతుంది. ఆయుష్ మాత్రే సేన శుక్రవారం తుది పోరులో.. ఇంగ్లాండ్‌ను ఢీకొనబోతోంది. చివరగా భారత జట్టు 2022లో అండర్19 ప్రపంచకప్ గెలిచింది. అప్పుడు ప్రత్యర్థి ఇంగ్లాండే కావడం విశేషం. టోర్నీలో సమష్టిగా, సాధికారికంగా ఆడకపోయినా.. కొన్ని మ్యాచ్‌ల్లో తడబడినా.. ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు భారత్. సెమీఫైనల్లో సైతం మొదట బౌలర్లు విఫలమవడంతో అఫ్గానిస్థాన్ 311 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. ప్రత్యర్థి బౌలింగ్‌లో పస లేకపోవడం, బ్యాటర్లు రెచ్చిపోవడంతో సునాయాసంగా ఆ మ్యాచ్ గెలిచేసింది ఆయుష్ బృందం. కానీ భారత్ లాగే అజేయంగా ఫైనల్ చేరడమే కాక, సెమీస్‌లో బలమైన ఆస్ట్రేలియాను ఓడించిన ఇంగ్లాండ్‌తో అంత తేలిగ్గా ఉండకపోవచ్చు. కెప్టెన్ థామస్ ర్యూ ఆ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. సెమీఫైనల్లో అతను అద్భుత శతకం సాధించాడు. బెన్ మేయర్స్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. టోర్నీలో అతను 399 పరుగులతో టాప్‌స్కోరర్లలో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఫాల్కనర్ కూడా నిలకడగా ఆడుతున్నాడు. బౌలర్లలో మ్యానీలమ్‌స్‌డెన్ టోర్నీలో అత్యధిక వికెట్ల (15) వీరుడిగా కొనసాగుతున్నాడు. సెబాస్టియన్ మోర్గాన్, రాల్ఫీ ఆల్బర్ట్ జోరుమీదున్నారు. భారత్‌కు బ్యాటింగే ప్రధాన బలం. ఫామ్‌తో తంటాలు పడుతున్న ఓపెనర్ ఆరోన్ జార్జ్ సెమీఫైనల్లో సెంచరీ సాధించడం జట్టుకు కలిసొచ్చే అంశం. కేరళకు చెందిన ఆరోన్.. హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. హైదరాబాద్ అండర్19 జట్టుకు కెప్టెన్ కూడా. ఫైనల్లోనూ ఆరోన్ రాణించాలని జట్టు కోరుకుంటోంది. మరో ఓపెనర్ సూర్యవంశీ పది ఓవర్లు నిలిచాడంటే మ్యాచ్ భారత్ వైపు తిరిగినట్లే. టోర్నీలో భారీ ఇన్నింగ్స్ ఆడకపోయినా.. సెమీస్ సహా కొన్ని మ్యాచ్‌ల్లో విలువైన పరుగులే చేశాడు. మాత్రే కూడా మంచి లయలోనే ఉన్నాడు. బౌలర్లలో అంబ్రిష్, కనిష్క్ కీలకం.

# ఇది కదా ఛాంపియన్ ఆటంటే..



మహిళల ప్రీమియర్ లీగ్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన ముంబయి ఈసారి గ్రూప్ దశే దాటలేదు. యూపీ చాలా ముందుగానే రేసు నుంచి తప్పుకొంది. దిల్లీ, గుజరాత్ ప్లేఆఫ్స్ చేరాయి కానీ.. లీగ్ దశలో తమ చివరి మ్యాచ్‌ల వరకు వాటికి ఉత్కంఠ తప్పలేదు. ఇలా ఈ సీజన్లో మిగతా జట్లన్నీ ఒక వైపు నిలిచాయి. కానీ బెంగళూరు వేరే స్థాయి ఆటతో ఇంకోవైపు నిలిచింది. వరుసగా అయిదు మ్యాచ్‌ల్లో గెలిచి చాలా ముందుగానే ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకోవడమే కాదు.. అత్యధిక విజయాలతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక తుది పోరులో 200 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించేయడం ద్వారా తమది అసలైన ఛాంపియన్ జట్టని చాటింది ఆర్సీబీ.

ఈ సీజన్లో ఆర్సీబీ ఆట మామూలుగా సాగలేదు. లీగ్ చరిత్రలోనే ఇలాంటి ఆధిపత్యం నభూతో. మొత్తంగా 9 మ్యాచ్‌ల్లో ఏడు నెగ్గింది ఆర్సీబీ. ఆ విజయాల్లో చాలా వరకు సాధికారికంగా సాధించినవే. లీగ్‌లో అత్యధిక పరుగులు సాధించింది ఆ జట్టు కెప్టెన్ స్మృతి మంధానే. బౌలింగ్ టాప్ 10లో నలుగురు ఆ జట్టు అమ్మాయిలే ఉండడం ఆ జట్టు ఆధిపత్యానికి నిదర్శనం.

దిల్లీ అంటే చాలు..: డబ్ల్యూపీఎల్ ఆరంభం నుంచి ఆర్సీబీకి కెప్టెన్ స్మృతి మంధానే అతి పెద్ద బలం. 2024లో జట్టుకు తొలి కప్పును అందించిన స్మృతి.. ఈసారి ఇంకా గొప్ప ప్రదర్శనతో జట్టు ఖాతాలో రెండో టైటిల్ చేర్చింది. ఆమె 9 మ్యాచ్‌ల్లో 53.85 సగటుతో 377 పరుగులు చేసింది. అందులో 3 అర్ధశతకాలు ఉన్నాయి. ముఖ్యంగా దిల్లీ అనగానే స్మృతి చెలరేగిపోతుంది. లీగ్ దశలో డీసీపై 96, 38 పరుగులు చేసిన ఈ ఓపెనర్.. ఆ జట్టుతో ఫైనల్లో 87 పరుగులతో టాప్‌స్కోరర్‌గా నిలిచింది. తుది పోరులో 200 పైచిలుకు లక్ష్యం అంటే ఏ జట్టయినా జావగారిపోతుంది. కానీ స్మృతి జట్టును ముందుండి నడిపించింది. గ్రేస్ హారిస్ (237), రిచా ఘోష్ (189) లీగ్ దశలో నిలకడగా రాణించి జట్టు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించారు.

తేడా ఆ ఇద్దరే..: గత సీజన్లో ఆర్సీబీ గ్రూప్ దశ కూడా దాటలేదు. ఈసారి తిరుగులేని ఆధిపత్యంతో కప్పు గెలిచింది. ఇక్కడ ప్రధాన తేడా ఇద్దరు బౌలర్లే. వారే లారెన్ బెల్, నదైన్ డిక్లెర్క్. ఇప్పటిదాకా డబ్ల్యూపీఎల్‌లో ఆడని ఇంగ్లిష్ బౌలర్ బెల్.. ఈసారి ఆర్సీబీ తరఫున అవకాశం దక్కించుకుని అద్భుత ప్రదర్శన చేసింది. ఆమె 9 మ్యాచ్‌ల్లో 16.58 సగటుతో 12 వికెట్లు తీసింది. ఆమె మొత్తంగా 212 బంతులు వేస్తే.. అందులో 128 డాట్‌బాల్స్ కావడం విశేషం. మరోవైపు డిక్లెర్క్ ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా రాణిస్తూ 16 వికెట్లతో టాప్3 బౌలర్‌గా నిలిచింది. డిక్లెర్క్ బ్యాటింగ్‌లోనూ రాణించింది. శ్రేయాంక (11 వికెట్లు), సయాలీ సత్ఘారే (9) కూడా తమవంతు పాత్ర పోషించారు.

ఆఖరి మెరుపు: జార్జియా వోల్.. ఈ సీజన్లో పెద్దగా వినిపించని పేరు. కానీ ఫైనల్లో మాత్రం ఆమె పేరు మార్మోగింది. 204 పరుగుల ఛేదనలో ఆరంభంలోనే ప్రమాదకర గ్రేస్ హారిస్ వికెట్‌ను కోల్పోవడంతో ఆర్సీబీకి కష్టమే అనుకున్నారంతా. కానీ వోల్.. హారిస్‌ను మరిపించే విధ్వంసక బ్యాటింగ్‌తో మ్యాచ్ గమనాన్ని మార్చేసింది. ఆమె నుంచి స్ఫూర్తి పొందిన స్మృతి కూడా తర్వాత చెలరేగింది. కెప్టెన్‌తో కలిసి రికార్డు భాగస్వామ్యంతో మ్యాచ్‌ను దిల్లీ నుంచి లాగేసింది జార్జియానే.